సాక్షి
గుంటూరు
శుక్రవారం : 13 : జూన్ : 2025



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: పులుపుల వారి వీధిలో శ్రీ వీరాంజనేయ సహిత శ్రీలక్ష్మీనారసింహస్వామి గుడి నిర్మాణానికి చిలకల పూర్ణవీర వెంకట మాధవరావు రూ.1.00.116 విరాళమిచ్చారు.



సామూహిక అక్షరాభ్యాసం

దుగ్గిరాల: ఐసీడీఎస్ ఆధ్వర్యాన చిలువూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం విద్యార్థుల పేర్లు నమోదు చేయించి, వారితో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.



వాహన తనిఖీలు


పెదకూరపాడు: స్థానిక బస్టాండ్ సమీపంలో కాలచక్ర రహదారిపై పిడుగురాళ్ల ఆర్టీవో సురేష్ బాబు గురువారం వాహన తనిఖీలు చేశారు. పలువురికి జరిమానాలు విధించారు.

సమస్యల స్వాగతం

వేసవి సెలవుల ఆటపాటలకు విరామం పలుకుతూ.. మళ్లీ చదువుల బాట పట్టేందుకు భుజాన బ్యాగుతో, మోమున చిరునవ్వుతో విద్యార్థులు హుషారుగా పాఠశాలలకు వెళ్లగా.. అక్కడ సమస్యలే స్వాగతం పలికాయి. ఉపాధ్యాయుల కొరత.. బదిలీలు ఒక కొలిక్కిరాకపోవడంతో గందరగోళ పరిస్థితి.. అధ్వాన మరుగుదొడ్లు.. పనిచేయని తాగునీటి ట్యాపులు.. తూతూమంత్రంగా మధ్యాహ్న భోజనం.. వీటన్నిటికి మించి పునఃప్రారంభం తొలిరోజే అందజేస్తామంటూ ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న విద్యామిత్ర కిట్లు అందకపోవడం. వెరసి పాఠశాలలు 'నాటి' కళను కోల్పోగా.. గొప్పలకు పోయిన సర్కారు అభాసుపాలైంది.

- ప్రభుత్వ స్కూళ్లలో కనిపించని నాటి సందడి
- పంపిణీకి నోచుకోని విద్యార్థి మిత్ర కిట్లు
- హడావుడి చేసి ఉసూరుమనిపించిన ప్రభుత్వం
- నగరపాలక సంస్థ స్కూళ్లలో నామమాత్రంగా మధ్యాహ్న భోజనం అమలు
- భోజనంలో మాయమైన కోడిగుడ్లు, చిక్కీలు
- పారిశుద్ధ్యం అధ్వానం.. మూలన పడ్డ మంచినీటి ఆర్వో ప్లాంట్‌లు

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం



గొలుసు నాంచారమ్మ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ మూతబడడంతో తాగునీటి ట్యాపుల వద్ద దుస్థితి



గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల అనంతరం జిల్లాలోని పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవులను సరదాగా గడిపిన విద్యార్థులు పుస్తకాల బ్యాగులను భుజాని కెత్తుకుని పాఠశాలలకు పయనమయ్యారు. అదే విధంగా నర్సరీతో పాటు ఒకటో తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులు బుడి, బుడి అడుగులతో పాఠశాలల్లో అడుగుపెట్టారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,730 పాఠశాలల వారీగా 3 లక్షల మంది విద్యార్థులు పాఠశాలల్లో అడుగుపెట్టారు. ఇందులో 1,074 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 93,464 మంది విద్యార్థులతో పాటు 656 ప్రైవేటు పాఠశాలల పరిధిలో మరో 2,60,354 మంది విద్యార్థులు ఉన్నారు.

నాటి కళ ఏదీ?

నూతన విద్యాసంవత్సరపు మొదటిరోజు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సందడి కనిపించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పండుగ వాతావరణంలో తెరుచుకునే పాఠశాలలు కూటమి పాలనలో కళతప్పాయి. విద్యాకానుకకు ప్రత్యామ్నాయంగా తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి నోచుకోలేదు. గుంటూరుజిల్లాలోని మండల పాయింట్లకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, డిక్షనరీలు చేర్చినట్లు చెబుతున్న విద్యాశాఖాధికారులు వాటిని కిట్ల రూపంలో సిద్ధం చేయడంలో విఫలమయ్యారు. యూనిఫాం సరఫరా కేవలం ఆరు మండలాలకే పరిమితం కావడంతో కిట్లు పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. పూర్తిస్థాయిలో సామగ్రి లేకుండా కిట్లు పంపిణీ చేయడం సాధ్యం కాకపోవడంతో పాటు ఆర్భాటంగా కార్యక్రమాలను నిర్వహించి, కిట్లు పంపిణీ చేయాలనే కారణంతో పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు కిట్లు ఇవ్వలేదు. ఫలితంగా పాఠశాలల్లో అడుగుపెట్టిన విద్యార్థులు యూనిఫాంకు బదులుగా సాధారణ వస్త్రాలు, గతేడాది పంపిణీ చేసిన పాత యూనిఫాంతోనే పాఠశాలలకు వచ్చారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు, బోర్డులు సిద్ధం చేయడంతో పాటు పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థితో బ్యాక్ టు స్కూల్ నినాదాన్ని రాసిన సెల్ఫీ స్టాండ్ వద్ద ఫొటోలు తీయించి సందడి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇవేమీ లేకుండా సాదాసీదాగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.

బదిలీల హడావుడిలో గురువులు

ఉపాధ్యాయులు బదిలీల్లో నిమగ్నం కావడంతో పాఠశాలల్లో మొదటి రోజున తరగతులు ప్రారంభం కాలేదు. ఇప్పటికే బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులు ఆర్డర్లు వచ్చే వరకూ పాత స్థానాల్లోనే పని చేయాలని అధికారులు సూచించడంతో ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల్లోనే ఉన్నారు. అదే విధంగా ప్రాథమిక పాఠశాలల్లో కీలకమైన ఎస్జీటీలు బదిలీల హడావుడిలో ఉన్నారు. గురువారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వెయ్యి మంది ఎస్జీటీలు పాఠశాలలను వదిలి వచ్చారు. అదే విధంగా నాడు-నేడు రెండో దశలో ప్రారంభించిన తరగతి గదుల నిర్మాణాలు కూటమి ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో సంబంధిత తరగతి గదులు అందుబాటులోకి రాలేదు.



పూర్తిస్థాయిలో అమలు కాని మిడ్డే మీల్

నూతన విద్యాసంవత్సరం తొలి రోజున ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పూర్తిస్థాయిలో అమలు కాలేదు. గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కోడి గుడ్లు, చిక్కీలు ఇవ్వలేదు. ఎక్కువ సంఖ్యలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తరువాత నింపాదిగా కోడి గుడ్ల స్టాక్ చేరుకోవడం ప్రారంభమైంది.



ఆదిలోనే అభాసుపాలు

పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థుల చేతుల్లో విద్యార్థి మిత్ర కిట్లు పెడతామంటూ హడావుడి చేసిన ప్రభుత్వం ఈ విషయంలో విఫలమైంది. జిల్లాలోని 18 మండలాల వారీగా పాఠ్య పుస్తకాలు, నోట్సులు, బ్యాగులు పూర్తిస్థాయిలో వచ్చాయని చెబుతున్న విద్యాశాఖాధికారులు యూనిఫాం ఆరు మండలాలకే రావడంతో కిట్లను సిద్ధం చేయలేకపోయారు.



ప్రభుత్వం యూనిఫాం ఇవ్వకపోవడంతో సాధారణ దుస్తుల్లో వచ్చిన విద్యార్థులు

న్యూస్‌రీల్

మోదీతోనే దేశాభివృద్ధి

మంత్రి సత్యకుమార్ యాదవ్



గుంటూరు మెడికల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదకొండేళ్ల పాలన జన రంజకంగా సాగిందని, మోదీ చేసిన అభివృద్ధి పనులు దేశ చరిత్రలో చిరస్థాయిగా సువర్ణాక్షరాలతో నిలిచిపోతాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన స్థానిక గొట్టిపాటి కల్యాణ మండపంలో వికసిత్ భారత్ అమృతకాల సేవ సుపరిపాలన 11 సంవత్సరాల అభివృద్ధిపై గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన దేశ ప్రజల్లో మార్పు, నమ్మకానికి ప్రతిరూపంగా నిలిచిందన్నారు. కులమతాలకతీతంగా అభివృద్ధి పథకాలతో 27 కోట్ల పేదలను దారిద్ర్యరేఖ నుంచి బయటకు తెచ్చిన ఘనత మోదీకే దక్కుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్షన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి ఏపీపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూప రాణి, జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామకృష్ణా రెడ్డి, జిల్లా సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక ఎస్.వి.ఎన్ కాలనీ శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం రెండో రోజుకి చేరాయి. ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యా హవచనం, అగ్ని ధ్యానం, నిత్య హోమం వన కుంభారోహణం, శ్రీవెంకటేశ్వర మూల మంత్ర హోమం వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళ స్వామి, అమ్మవార్ల ఎదుర్కోల ఉత్సవాన్ని చేపట్టారు. అనంతరం శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి డాక్టర్ పుచ్చా వెంకటమల్లేశ్వర్, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


విద్యాసంస్థలకు ఫైన్ క్వాలిటీ బియ్యం

జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలకు నాణ్యమైన ఫైన్ వెరైటీ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యాయన్నారు. దీనిలో భాగంగా పౌరసరఫరాల కార్పొరేషన్ రబీలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో సీఎంఆర్ చేయించి, అనంతరం నిల్వ చేసిన బియ్యం విద్యార్థులకు అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. సులభంగా ప్యాక్ చేయడానికి అనుకూలంగా 25 కేజీల బస్తాలుగా రీప్యాక్ చేస్తున్నామన్నారు. గుంటూరు జిల్లాలో 1072 పాఠశాలలు, 68 హాస్టళ్లకు అవసరమైన 25 కేజీల 9,693 రైస్ బ్యాగ్‌లను ఇప్పటికే సరఫరా చేశామన్నారు. సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 512.60 అడుగుల వద్ద ఉంది. ఇది 136.1274 టీఎంసీలకు సమానం.

అయ్యో.. గాంధ్ర!

చనిపోయిన వారికి యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు

- దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారంటూ వారి కుటుంబ సభ్యుల ఫోన్లకు సందేశాలు
- బిత్తరపోతున్న కుటుంబీకులు
- ప్రత్తిపాడు అధికారులు, సచివాలయ ఉద్యోగుల నిర్వాకం

- ప్రత్తిపాడు రామానగర్ కాలనీకి చెందిన గొరిజవోలు సామ్రాజ్యం 2023 ఆగస్టు 18న చనిపోయారు. కానీ ఆమె ఈ నెల 7వ తేదీన యోగాంధ్రకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు, యోగాసనాలకు వచ్చినప్పుడు అధికారులకు ఈ క్యూఆర్ కోడ్ చూపించమని ఆధార్ నంబర్ లింక్ అయ్యి ఉన్న కుటుంబ సభ్యుల మొబైల్ నంబర్‌కు సందేశం వచ్చింది. దీంతో బిత్తరపోయిన ఆమె కుమారుడు వారి బంధువులు, తెలిసిన వారికి చూపిస్తూ మా అమ్మ యోగాకు వస్తుందంట.. అంటూ వ్యంగ్యాస్త్రాలతో అధికారుల నిర్వాకాన్ని ఎండగడుతున్నాడు.

- ప్రత్తిపాడుకు చెందిన ఎస్.రమాదేవి 2022లో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈమె కూడా ఈ నెల 11వ తేదీన యోగాంధ్రలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు కుమారుని మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. 'మీరు యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో పాల్గొనాలన్న మీ ఆసక్తికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాం' అంటూ క్యూర్ కోడ్, ఐడీ నంబరుతో వచ్చిన సందేశం చూసి ఆమె కుమారుడు షాక్‌కు గురయ్యాడు.




GNT-290525-20890065
Gorujavolu Sambrajyam

గౌరవనీయులైన Gorujavolu Sambrajyam గారు,

మీరు యోగాంధ్ర 2025 కార్యక్రమంలో పాల్గొనాలన్న ఆసక్తికి హృదయపూర్వక అభినందనలు

మృతిచెందిన గొరిజవోలు సామ్రాజ్యం పేరుతో వచ్చిన యోగాంధ్ర మెసేజ్



GNT-290525-20986438
Notu Ramadevi

గౌరవనీయులైన Notu Ramadevi గారు,

మీరు యోగాంధ్ర 2025 కార్యక్రమంలో పాల్గొనాలన్న ఆసక్తికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాం.
మీ యోగాంధ్ర నమోదు సంఖ్య: GNT-290525-20986438

మీ QR కోడ్ ID కార్డు ఈ సందేశానికి జత చేయడం జరిగింది. దయచేసి డౌన్‌లోడ్ చేసుకోండి.

యోగాంధ్రలో పాల్గొనాలంటూ మృతురాలు ఎస్.రమాదేవికి వచ్చిన సందేశం

ప్రత్తిపాడు: యోగాంధ్ర రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సచివాలయ ఉద్యోగులకు తిప్పలు తెచ్చి పెట్టింది. కచ్చితంగా వారి పరిధిలోని హౌస్ హోల్డ్స్‌కు రిజిస్ట్రేషన్ చెయ్యాల్సిందేనని మండల స్థాయి అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో హౌస్ హోల్డ్స్ డేటా తీసుకుని, సచివాలయాల్లో కూర్చుని సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేస్తున్నారు. దీంతో మృతిచెందిన వారికి, బతికి ఉన్నవారికి తేడా లేకుండా అందరికీ యోగాంధ్ర రిజిస్ట్రేషన్ మెసేజ్‌లు వస్తున్నాయి. ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ లింక్ అయ్యి లేని వారికి మాత్రమే ఓటీపీలు వస్తున్నాయి. లింక్ అయిన వారికి ఓటీపీలు రాకుండా నేరుగా ప్రాసెస్ అవుతుండటంతో, జనం ఇష్టాయిష్టాలు, ఆసక్తితో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా ప్రజలకు తెలియకుండానే యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. ఒక్కో సచివాలయానికి 1500 రిజిస్ట్రేషన్ల చొప్పున టార్గెట్‌లు విధించినట్లు తెలుస్తోంది.

ఆది నుంచి ఇదే తీరు..

యోగాంధ్ర అమలులో అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతో మండలంలో ఆది నుంచి అభాసుపాలే అవుతుంది. మొక్కుబడి తంతుగా నిర్వహించి చేతులు దులిపేసుకుంటున్నారు.

- నాలుగు రోజుల కిందట ర్యాలీ పేరుతో ఫొటోలకు స్టిల్స్ ఇచ్చి, ర్యాలీ చేయకుండానే చేసినట్లుగా షో చేశారు.
- అధికారుల షో పై పత్రికల్లో కథనాలు రావడంతో మర్నాడు మరోమారు ఫొటో షూట్ ఏర్పాటు చేశారు.
- పక్కనే సచివాలయంలో కుట్టు శిక్షణ నేర్చుకునేందుకు వచ్చిన మహిళలను పిలిపించి, వారిని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిలబెట్టి, లోపల నుంచి ఫ్లెక్సీ తెప్పించి మూడు నిమిషాల్లో మూడు యోగాసనాలు మూకుమ్మడిగా వేస్తున్నట్లు స్టిల్స్ ఇచ్చి, ఫొటోలు దిగి ఫొటోషూట్ ను క్లోజ్ చేశారు.
- క్రమశిక్షణ పేరుతో తొలిరోజు యోగాపై నిర్వహించిన శిక్షణకు ఆలస్యంగా హాజరైన సచివాలయం సిబ్బందిని బయటే నిలబెట్టి పనిష్మెంట్ ఇవ్వడం అప్పుడు చర్చనీయాంశం అయ్యింది. ఆ హడావిడి కూడా ఒకటి రెండు రోజులకే పరిమితం అయ్యింది.

విచారిస్తాం..

చనిపోయిన వారి పేర్లతో యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు చేయడం సరికాదు. దీనిపై వెంటనే విచారిస్తాను. చర్యలు తీసుకుంటాను. పక్కాగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు వారితో సమావేశాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నాం.

– కె.శివపార్వతి, ఎంపీడీఓ, ప్రత్తిపాడు

ప్రభుత్వ విద్య బలోపేతమే ధ్యేయం

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిటౌన్: ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే ధ్యేయమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం తెనాలి మారీసుపేటలోని ఎన్‌సీఆర్ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. మధ్యాహ్నం సమయంలో విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రుచి, శుచితో కూడిన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులు, నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాలలో మొత్తం 674 మంది విద్యార్థులు చదువుతుండగా మొదటి రోజున 274 మంది విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల హెచ్‌ఎం కరిముల్లా మంత్రి మనోహర్‌కు తెలిపారు. ఎంఈఓలు వి.జయంతిబాబు, మేకల లక్ష్మీనారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

రైతులకు నష్టపరిహారం అందజేస్తాం



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, కలెక్టర్ నాగలక్ష్మి

దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజ్ బాధిత రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో 2024 జనవరి 19న జరిగిన అగ్నిప్రమాదం వల్ల వేలాది మంది రైతులు తమ పసుపు పంటలను కోల్పోయారని, వారికి నష్టపరిహారం అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరు చుట్టుగుంటలోని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ కమిషనరేట్ కార్యాలయంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి గురువారం ఆయన బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రమాదంపై కలెక్టర్ స్థాయి అధికారులతో విచారణ చేపట్టామని, రైతులకు ఎంత నష్టం వాటిల్లింది అనే అంశంపై నివేదిక తీసుకున్నామన్నారు. పసుపు క్వింటాకు రూ.7 వేలు రైతులకు అందజేసేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఇన్స్యూరెన్స్ కంపెనీ నుంచి నగదు అందగానే రైతులకు డబ్బులు అందజేస్తామని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూనే ఉన్నామని త్వరితగతిన పరిహారం అందజేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి కోర్టులో జిల్లా జడ్జి పర్యటన

దెబ్బతిన్న కోర్టు భవనాలు, జడ్జిల క్వార్టర్లు పరిశీలన



తెనాలి కోర్టుల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

తెనాలిరూరల్: తెనాలి కొత్తపేటలోని కోర్టుల ప్రాంగణాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి గురువారం పరిశీలించారు. కోర్టు భవనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దెబ్బతిన్న భవనాలకు మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏం చేయాలి? అని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులకు భవనం లేదని బార్ అసోసియేషన్ తరఫున అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ వినతిపత్రం అందజేశారు. అనంతరం జడ్జీల క్వార్టర్లను ప్రధాన న్యాయమూర్తి పరిశీలించారు. మెరుగైన సౌకర్యాల కల్పనకు ఏం చర్యలు తీసుకోవాలన్న విషయమై నివేదిక ఇవ్వాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేక్ వర్ధన్, రెండోఅదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, జాయింట్ సెక్రటరీ అప్పల కిషోర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు కొండవీడు కోటలో 'యోగాంధ్ర'

యడ్లపాడు: వర్షం కారణంగా రద్దయిన కొండవీడు కోటలో యోగా కార్యక్రమం తిరిగి శుక్రవారం ఉదయం నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'యోగాంధ్ర – 2025' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని తొలుత 11న నిర్వహించాల్సి ఉండగా, వర్షం వల్ల తాత్కాలికంగా రద్దు చేశారు. వర్షం తగ్గిన నేపథ్యంలో 13న నిర్వహించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. చెక్‌పోస్టు వద్ద ఉదయం 6 నుంచి గంటన్నరపాటు నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొననున్నారు.

కొనసాగుతున్న బదిలీల కౌన్సెలింగ్

నేడు జెడ్పీ, మున్సిపల్ ఎస్జీటీలకు ..

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీ (తెలుగు)లకు మాన్యువల్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ కొనసాగుతోంది. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం సీనియార్టీ జాబితాలోని వరుస క్రమంలో 751 నుంచి 1750 వరకూ పేర్లు ఉన్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ కె.సుబ్బారెడ్డి పరిశీలించారు. కాగా శుక్రవారం ఉదయం 8 గంటలకు జెడ్పీ యాజమాన్యంలోని ఎస్జీటీలు(తెలుగు) 1751 నుంచి 2400 నంబరు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని డీఈఓ సీవీ రేణుక తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో జిల్లా పరిశీలకురాలు పి.శైలజ, పల్నాడు డీఈఓ చంద్రకళ, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు రమణ, శైలజ, ఏపీఎస్‌డీఎంఏ డీపీఎం ఎ.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సుబ్బారెడ్డి, శైలజ, డీఈఓలు

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,402
అమ్మకాలు	46,207
నిల్వ	6,136

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-12,500
273	10,000-12,500
341	10,000-13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,600
నంబరు-5	10,000-13,500
341	10,000-14,000
సూపర్ -10	10,000-13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,300
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	5,000-7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,500
బాడిగ-355	10,000 - 13,400
దేవనూరు డీలక్స్	10,000 - 13,800
తాలు	5,000 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 491

కొమ్ములు : 445 బస్తాలు

కనిష్ట :	గరిష్ట : (ధర రూ॥ల్లో)	మోడల్ :
8,350	10,000	9,600

కాయలు : 46 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,350	10,000	9,000

మొత్తం అమ్మకాలు : 368.250 క్వింటాళ్లు

-దుగ్గిరాల

డాక్టర్ వెలగా సేవలు శ్లాఘనీయం

కాంస్య విగ్రహావిష్కరణలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి: గ్రంథాలయ రంగ ఉన్నతికి, సాహితీ వ్యాప్తికి గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య చేసిన కృషి నేటితరానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలికి చెందిన సాహితీ ప్రముఖుడు, గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య జయంతి రోజైన గురువారం ఇక్కడి తెనాలి బండ్‌పై ఏర్పాటుచేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. డాక్టర్ వెలగాతో తనకు గల అనుబంధాన్ని మంత్రి గుర్తుచేసుకున్నారు. తెనాలి మున్సిపాలిటీ శతాబ్ది ఉత్సవాల్లో సావనీరు రూపకల్పనలో ఆయన కీలకంగా వ్యవహరించారన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ వెలగాను 'నడిచే గ్రంథాలయ విజ్ఞాన సర్వస్వం'గా అభివర్ణించారు. మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి తన ప్రసంగంలో డాక్టర్ వెలగా కాంస్య విగ్రహం ఏర్పాటు, భావితరాలకు స్ఫూర్తి కాగలదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక డాక్టర్ వెలగా సేవలను కొనియాడారు. డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహాన్ని రూపొందించిన కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా సత్కరించారు. డాక్టర్ వెలగా కుమారులు సర్వోత్తమరావు, నాగార్జున, వెంకట్రావు, మానవేంద్ర, సోదరుడు వెలగా వీరయ్యతోపాటు గ్రంథాలయ రంగ ప్రముఖుడు లంకా సూర్యనారాయణ, ఈదర పూర్ణచంద్, మాదిరాజు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతరం హోటల్ గౌతమ్ గ్రాండ్‌లో డాక్టర్ వెలగా విగ్రహావిష్కరణ సభను నిర్వహించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, ప్రముఖ రచయిత, పరిశోధకుడు ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ నన్నపనేని ప్రతాప్, పార్వతీపురంకు చెందిన పారినాయుడు, ప్రొఫెసర్లు లక్ష్మి, అయినాల మల్లేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీంజాని పాల్గొన్నారు. పావులూరి శ్రీనివాసరావు రచన 'ఆరు దశాబ్దాల అలుపెరగని డాక్టర్ వెలగా కృషి' అనే పుస్తకం, విశ్రాంత ప్రొఫెసర్ జి.రామేశ్వర్ రచన 'ప్రకృతి వైద్యం గ్రంథ సూచి' ప్రతిని ఆవిష్కరించారు.



డాక్టర్ వెలగా విగ్రహావిష్కరణలో మంత్రి నాదెండ్ల, బుద్ధప్రసాద్, రాధిక కుటుంబసభ్యులు

ములకలూరులో మట్టి అక్రమ తవ్వకాలు

- అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు
- పరిశీలించిన వీఆర్‌ఓ

నరసరావుపేట రూరల్: ములకలూరులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. డీకే పట్టా భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారు. అధికారపార్టీ నాయకులే మట్టిమాఫియా నిర్వహిస్తుండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పగులు, రాత్రి తేడా లేకుండా భారీ మిషన్లతో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. లారీలతో గ్రావెల్‌ను నరసరావుపేటకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ గ్రావెల్ వ్యాపారంలో ప్రజాప్రతినిధికి వాటాలు అందుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. దాదాపు 20 అడుగుల మేర తవ్వకాలు జరుపుతుండటంతో సమీపంలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన రైతులు అక్రమ తవ్వకాలపై నూనె కోటేశ్వరమ్మ అనే మహిళ జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఎస్సీలకు 2008లో డీకే పట్టాలను ప్రభుత్వం పంపిణీచేసిందని, ఇందులో భాగంగా మాకు ఎకరం భూమిపై పట్టా అందజేసినట్టు తెలిపారు. ఈ భూమికి ఇరువైపులా ఉన్న డీకే పట్టాలను మట్టి మాఫియా కొనుగోలు చేసి పెద్ద ఎత్తున తవ్వకాలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. దీని వలన మా పంట భూమిలోకి నీరు వచ్చే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదుతో వీఆర్‌వో రామకృష్ణ గురువారం అక్రమ తవ్వకాలను పరిశీలించారు.



అక్రమ మట్టి తవ్వకాలతో ఏర్పడిన గోతులు

బ్రాహ్మణులను కించపరిచే సన్నివేశాలను తొలగించాలి

నగరంపాలెం: సెన్సార్ బోర్డ్ (సీబీఎఫ్‌సీ)ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంత్రించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ అన్నారు. గురువారం నగరంలో పర్యటించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, భాజపా రాష్ట్ర నాయకులకు బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవా సంఘం, సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ, హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి సంయుక్తంగా వినతిపత్రం అందించారు. నటుడు మంచు మోహన్‌బాబు నిర్మించిన కన్నప్ప చిత్రంలో సనాతన ధర్మాన్ని కించపరిచారని శ్రీధర్‌శర్మ మంత్రి, నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. బ్రాహ్మణ ఆచార వ్యవహారాల్లో ఒక భాగమైన శిఖను అవమానపరిచేలా పిలక, గిలక అనే పాత్రలు సృష్టించారని విమర్శించారు. బ్రాహ్మణ సమాజాన్ని అవమానించడం మంచు మోహన్‌బాబు కుటుంబానికి అలవాటైందని మండిపడ్డారు. గతంలో 'దేనికైనా రెడీ' చిత్రంలో బ్రాహ్మణ జాతిని కించపరిచేలా, మనోభావాలకు భంగం కలిగించేలా ప్రవర్తించారని ఆయన గుర్తుచేశారు. ఏపీ అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వరశాస్త్రి మాట్లాడుతూ కన్నప్ప చిత్రంలో బ్రాహ్మణ జాతి మనోభావాలు దెబ్బతినేలా సన్నివేశాలు చిత్రీకరించారని వాపోయారు. కన్నప్ప చిత్రంలో సన్నివేశాలు తొలగించేలా అధికారులకు ఆదేశించాలని వారు కోరారు. దర్భనప్పు శ్రీనివాస్, ఐలూరు శ్రీనివాస్, యనమదల ఆంజనేయులు, ఎండపల్లి శబరి, చిలుమూరు ఫణి, వేదాంతం లక్ష్మణ్, అర్చక, పురోహిత బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

71 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే ముఠా గుట్టురట్టయింది. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఓ ఇంట్లో నిల్వ ఉంచిన బియ్యంను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు 29వ వార్డులోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో 71 బస్తాల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ వీరానాయక్ బియ్యం నిల్వలను పరిశీలించారు. వినియోగదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు నిల్వ చేసిన 29వ వార్డుకు చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు స్వాధీన పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తెనాలిలో 35 బస్తాలు స్వాధీనం

తెనాలిరూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెనాలి నుంచి బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు గురువారం తెల్లవారుజామున అంగలకుదురు వద్ద తనిఖీ చేయగా పట్టణానికి చెందిన రమావత్ లోకేష్ అలియాస్ సూర్యనాయక్ టాటా దోస్త్ వాహనంలో 50 కిలోల చొప్పున ఉన్న 35 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పెదరావూరుకు చెందిన అశోక్, బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన కార్తీక్ రేషన్ బియ్యాన్ని వట్టిచెరుకూరులోని రౌస్ మిల్లుకు తరలిస్తున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. రైస్ మిల్లు ఓనరు లోకేష్, అశోక్, కార్తీక్‌లపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ కె.ఆనంద్ తెలిపారు.



పొన్నూరులో పట్టుబడిన రేషన్ బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న సీఐ వీరానాయక్

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,500 గరిష్టం : రూ. 3,800

మోడల్ ధర రూ. 3,200

నేడు న్యాయవాదుల సమావేశం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదుల ముఖ్య సమావేశం జరగనుంది. నగరంలోని జేకేసీ కళాశాల రోడ్డులోని వికాస్ ఇన్ హోటల్‌లో న్యాయవాదుల సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పార్టీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్ తెలిపారు. పలు కీలక అంశాలపై చర్చించడంతోపాటు, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుని భవిష్యత్తు ప్రణాళికపై చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి, లీగల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి, మాజీ అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, పార్టీ పార్లమెంట్ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్, విజయవాడ పార్లమెంట్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డితోపాటు, ముఖ్య నేతలు, సమన్వయకర్తలు హాజరు కానున్నారు. పలు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున న్యాయవాదులు హాజరు కావాలని సి.డి.భగవాన్ పిలుపునిచ్చారు.

బావిలో పడి యువకుడు దుర్మరణం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రాచపూడి గ్రామానికి చెందిన పప్పు గోపీకృష్ణ (34) ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందినట్లు కొరిశపాడు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి బావిలో నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడి మృతి చెందినట్లు మృతుని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా గురువారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గోపీకృష్ణ మృతదేహం

చీరాల రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: స్థానిక రైల్వేస్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్‌ఫాం బల్లపై సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య గురువారం తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. యాచన చేస్తూ అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ఎస్సై అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతదేహం గురించి ఎవరికైనా తెలిసినట్లయితే జీఆర్పీ ఎస్సై 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందారు. వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోపల్లెకి చెందిన కారుమంచి దేవదానం(70) గురువారం పట్టణంలో జరిగిన ఓ దుకాణ ప్రారంభోత్సవానికి తన మోపెడ్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సుల్తానాబాద్‌కు రాగా వెనుక నుంచి వచ్చిన సిమెంటు లోడు లారీ ఢీ కొట్టడంతో లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోపల్లె వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ కారుమంచి కిషోర్‌బాబుకు దేవదానం స్వయానా సోదరుడు.

నాణ్యత, మన్నికకు భారతి సిమెంట్

తెనాలిరూరల్: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారైన నాణ్యమైన సిమెంటును వినియోగదారులు ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.భవానీశంకర్ సూచించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఆవులవారిపాలెం గ్రామంలోని శ్రీ సాంబశివ ట్రేడర్స్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సును గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందన్నారు. సిమెంటు తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని తెలిపారు. భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్‌తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలను చేసి, సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధిత డీలరు ద్వారా వివరాలు తెలుసుకుని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. శ్రీ సాంబశివ ట్రేడర్స్ యజమాని విష్ణుమొలకల పరమేశ్వరరావు, ఇతర డీలర్లు, భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.



మేస్త్రీలకు బీమా బాండ్‌లను అందజేస్తున్న పరమేశ్వరరావు, సురేష్, భవానీశంకర్

మాజీ సైనికుల కార్పొరేషన్ నెలకొల్పాలి

మాజీ సైనికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోటూరు శంకరరావు

నగరంపాలెం: మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీ మాజీ సైనికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోటూరు శంకరరావు అన్నారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ నెలకొల్పే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణను రూపొందించాలని అన్నారు. దేశ రక్షణలో విధులు నిర్వర్తించి, మిలటరీ నుంచి బయటకు వచ్చిన కొందరు సైనికులు అనారోగ్యాలతో మరణించారన్నారు. తద్వారా మాజీ సైనికుల కుటుంబ సభ్యులు ఇబ్బందుల్లో ఉన్నారని వాపోయారు. వారి సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐనంపూడి రత్నప్రసాద్ మాట్లాడుతూ కొందరి సైనికుల కుటుంబ పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. మాజీ సైనికుడు వాకా ఆదినారాయణ, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోటూరు శంకరరావు

చెరువులో పడిన కారు

మేదరమెట్ల: విజయవాడ నుంచి శింగరాయకొండకు వెళుతున్న కారు గురువారం ఉదయం కొరిశపాడు జాతీయ రహదారి రొయ్యల ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న రహదారి వద్దకు కారు రాగానే డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన కారు డివైడర్ కోసం ఉంచిన సిమెంట్ దిమ్మెను ఢీ కొని పక్కనే ఉన్న చెరువులోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ప్రయాణికులు లేకపోడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి చెరువులో పడిన కారును బయటకు తీసే ప్రయత్నాలు చేపట్టారు.



కొరిశపాడు జాతీయ రహదారి సమీపంలోని చెరువులో పడిన కారు

16న జాబ్‌మేళా

మాచర్ల: డిపార్టుమెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యంలో ఎస్‌బీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామయ్య, నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు గురువారం తెలిపారు. పల్నాడు జిల్లా నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పది కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.12వేల నుంచి రూ. 30వేల వరకు జీతం ఉంటుందన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ, తదితర కోర్సులు చదివిన అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. ఇతర వివరాలకు 7842747682 నెంబరులో సంప్రదించాలన్నారు.

లక్ష్మీనారాయణకు ఉత్తమ రైతు పురస్కారం



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రైతు లక్ష్మీనారాయణ

పర్చూరు(చినగంజాం): మండలంలోని తిమిర్తిపాడు గ్రామానికి చెందిన బోడావుల లక్ష్మీనారాయణ 2025 ఏడాదికి గాను డాక్టర్ ఎంవీ రెడ్డి ఉత్తమ రైతు పురస్కారం అవార్డు అందుకున్నారు. గురువారం ఆచార్య ఎన్జీ రంగా 62వ ఫౌండేషన్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా గుంటూరు లాంఫాంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెంనాయుడు అవార్డు అందజేశారు. స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావు, వీసీ శారదా జయలక్ష్మి, డీఆర్ పీవీ సత్యనారాయణ, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ అదృష్టం, ప్రసాద్, సైంటిస్టులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నరసరావుపేట ఈస్ట్: విశాఖ ఉక్కు కర్మాగారంలో అన్యాయంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేసే దానిలో భాగంగా కార్మికుల తొలగింపును చేపట్టడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. విశాఖ ఉక్కు -ఆంధ్రుల హక్కు నినాదంతో ఎందరో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న పరిశ్రమను నేడు పథకం ప్రకారం నష్టాలు వస్తున్నాయనే సాకుతో ప్రైవేటుపరం చేయాలని చూడటం దారుణమన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి నిధులు, గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ కార్యనిర్వహణ అధ్యక్షుడు ఉప్పలపాటి రంగయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, సత్యనారాయణరాజు, అంజిరెడ్డి, ఎం.నాగేశ్వరరావు, లక్ష్మారెడ్డి, ఎస్.దేవి, దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు